నేడు 'డయల్ యువర్ డీఎం'

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకోవడానికి నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. ప్రయాణికులు సోమవారం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 9959226152 నెంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు సమస్యలు ఉంటే తెలపాలని కోరారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా నేడు గౌడవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ మౌలాలి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బాసిరేగడి, జ్ఞానాపూర్, అయోధ్య చౌరస్తా ప్రాంతాలలో కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నరేందర్



మేడ్చల్: మేడ్చల్ జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన నరేందర్ నియమితులయ్యాడు. మేడ్చల్‌కు చెందిన యూనివర్సిల్ 369 అసోసియేషన్ నరేందర్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నరేందర్ మేడ్చల్ మున్సిపల్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. సీఎం కప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

అభినందనలు



ఘట్‌కేసర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శివచరణ్‌రెడ్డిని యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బొక్క సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు. యూత్ కాంగ్రెస్ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించినట్లు సంజీవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజయ్, నియోజకవర్గ అధ్యక్షుడు రాహుల్ యాదవ్, ఉపాధ్యక్షుడు అంజన్‌గౌడ్, నాయకులు రఫీయుద్దీన్, కృష్ణ, నితీష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మర్పల్లిగూడలో వెంకటాపూర్ నీలిమా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. శిబిరంలో స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) సూర్యదేవర నీలిమా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి 50 శాతం రాయితీ కల్పిస్తామని, జిల్లాలో 80 క్యాంపులు నిర్వహించి సుమారు 40 వేల మందికి పైగా వైద్యసేవలు అందించామన్నారు. కార్యక్రమంలో శిబిరం బాధ్యుడు భరత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, వైద్యులు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మార్గంలో నడవాలి



కీసర: అంబేడ్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాల్సిన అవసరం ఉందని యువన్యాయవాధి, కీసరగుట్ట ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు దుర్గం సాయినాథ్‌గౌడ్ అన్నారు. వారం వారం అంబేడ్కర్‌కు జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం కీసర అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన 153వ జ్ఞానమాల కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ముసుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, నేతలు కుమార్, వేణుగోపాల్, శ్యామ్‌కుమార్, సంతోష్, కట్టశం కరయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డా కూలీ.. బతుకు భారం

- తగ్గిన నిర్మాణ రంగం, దొరకని పని
- రియల్ రంగం జోరు తగ్గడంతో అడ్డా కూలీల ఆవేదన
- పనుల కోసం ఆశగా ఎదురుచూపులు
- నత్తనడకన సాగుతున్న నిర్మాణ రంగం
- అగమ్యగోచరంగా కూలీల పరిస్థితి



మేడ్చల్ : హైదరాబాద్ నగరానికి ఉత్తర భాగాన ఉన్న మేడ్చల్ వైపు ప్రభుత్వం గత సంవత్సర కాలంగా ఎలాంటి ప్రాజెక్టులు ప్రకటించకపోవడం, ఉన్నవాటి ఊపు తగ్గడం, హైడ్రా భయంతో రియల్ వ్యాపారం పూర్తిగా తగ్గడంతో నిర్మాణ రంగం నత్తనడకన సాగుతోంది. పెట్టుబడులు పెట్టె సంస్థలు నూతన ప్రాజెక్టులు చేపట్టకపోవడం, తగ్గిన ఊపుతో కొనుగోలుదారులు వెనుకడుగులు వేయడం వంటి కారణాలతో నిర్మాన రంగం పూర్తిగా కుదేలు కావడంతో.. ఆ రంగంపై ఆధారపడ్డ కుటుంబాలు ప్రధానంగా కూలీలు చేతి నిండా పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా, భూపాలపల్లి జయశంకర్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి కూలీ కోసం ప్రతినిత్యం వచ్చి అడ్డా కూలీలుగా పని చేస్తున్నారు. కూలీ పని కోసం కూలీలుగా గుంపుగుంపులుగా తెల్లవారే సరికి రైళ్లలో, ఇతర రవాణా మార్గాల ద్వారా తమ నివాసాల నుంచి మేడ్చల్ అడ్డాకు చేరుకుంటారు. పనుల కోసం పిలిచే వారి కోసం రైల్వే స్టేషన్ రోడ్డులో, డివైడర్‌పై కూర్చొని చేతిలో తెచ్చుకున్న సద్ది పట్టుకుని ఆశగా ఎదురుచూస్తుంటారు.

పనులు దొరకక..

ఇక్కడికి వచ్చిన వారంతా పల్లెల నుంచి నిత్య కూలీ కోసం వచ్చిన వారే. తమ ప్రాంతాల్లో సరైన పనులు దొరకకపోవడంతో మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పనుల కోసం పట్టణానికి నిత్యం రైలులో వచ్చిపోతుంటారు. మెదక్ జిల్లా కూలీలతో పాటు మేడ్చల్‌లో నివసముండే ఉత్తర భారతదేశానికి చెందిన వివిధ రాష్ట్రాలకు చెందిన వారు అడ్డాపై కూలీలుగా కనిపిస్తున్నారు. ఇక్కడ పనిని బట్టి రూ. 800 నుంచి 1000 వరకు వస్తుంది. కానీ పోటీ ఉంటే రూ. 150 నుంచి రూ. 100కే వరకు తగ్గుతుంది.

తగ్గిన పనులు..

మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో గత పదేళ్లుగా ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక ప్రభావం నిర్మాణ రంగంపై అధికంగా పడింది. దీంతో ఈ ప్రాంతంలో ప్రారంభం కావాల్సిన నూతన రియల్‌ప్రాజెక్టులు గత సంవత్సర కాలంగా ప్రారంభం కావడం లేదు. బుకింగ్‌లు లేక విల్లాలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మానం కాస్త తగ్గింది. నిర్మాణ రంగంలో అందరితో పాటు క్రీయాశీలకంగా పని చేసేది రోజు వారి కూలీలే కావడంతో.. వారి జీవనం పై తగ్గిన రియల్ జోరు ప్రభావం ఎక్కువగా పడింది. గ్రామాలను, స్వస్థలాలను వదిలి మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో పనులకు అలవాటు పడ్డ కూలీలు స్వంత ప్రాంతాలకు వెళ్లలేక, ఉన్న చోట పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. తగ్గిన రియల్ జోరుతో పెట్టుబడిదారులు, వ్యాపారులు, బ్రోకర్లు, డాక్యుమెంట్ రైటర్లు, ప్రభుత్వ ఆదాయం ఇలా అన్నింటికి గండి పడగా.. రెక్కాడితే గాని డొక్కాడని కూలీలు సైతం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.



రైల్వేస్టేషన్ రోడ్డులో కూలీ పనుల కోసం అడ్డా మీద వేచిచూస్తున్న కూలీలు

సర్వదోష నివారణ మహాయజ్ఞంలో హరియాణా గవర్నర్



మహాయజ్ఞంలో గవర్నర్ దత్తాత్రేయ, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

మేడ్చల్ రూరల్: టెంకాయ విశిష్టతను తెలిపేందుకే సర్వదోష నివారణ మహాయజ్ఞంలో టెంకాయలు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాయి గీత ఆశ్రమ వ్యవస్థాపకులు సద్గురు సాయికుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సాయిగీత ఆశ్రమంలో ప్రతి యేటా డిసెంబర్ చివరి ఆదివారం సర్వ దోష నివారణ మహాయజ్ఞం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా సద్గురు మాట్లాడుతూ లోక కల్యాణార్థం, విశ్వశాంతి, పంచభూత శాంతి కోసం ఈ సర్వదోష నివారణ మహా యజ్ఞాన్ని గత 60 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా ఈ యజ్ఞంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15వ వార్షికోత్సవం



పోచారం: పోచారం మున్సిపాలిటీ ఎల్ఐజీ టౌన్‌షిప్‌లో 15వ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ బాలగోని వెంకటేష్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జాబిన్ సుల్తానా, సురేష్, మహేందర్‌గౌడ్, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి మీనా, శ్రీకాంత్ చౌదరి, స్థానికులు పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భరత్



పోచారం: పోచారం మున్సిపాలిటీ సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఈ నెల 22న జరిగాయి. లెక్కింపు అనంతరం టౌన్‌షిప్ అధ్యక్షుడిగా హరిప్రసాద్‌రావు తన ప్రత్యర్థి భరత్‌పై 1 ఓటు ఆధిక్యతతో గెలుపొందినట్లు ఎన్నికల కమిటీ ప్రకటించింది. కాగా కౌంటింగ్ ప్రక్రియపై అనుమానం రావడంతో ఓడిన అభ్యర్థి భరత్‌కుమార్ రీకౌంటింగ్ చేయాలని కోరాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తిరిగి లెక్కించగా అధ్యక్షుడిగా భరత్ 4 ఓట్లు ఆధిక్యతతో గెలుపొందినట్లు ప్రకటించారు.



పడకేసిన పారిశుద్ధ్యం

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలంలో పారిశుద్ధ్యం పడకేసింది. మండల పరిధిలోని చాలా చోట్ల ఎక్కడబడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. ముఖ్యంగా అలియాబాద్, లాల్‌గడి మలక్‌పేట గ్రామాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా చెత్త దర్శనమిస్తున్నాయి. ఇళ్లు, దుకాణసముదాయాలు, రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలి. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. అధికారులు చెత్తను తొలగించి, పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన సంవత్సర కేలండర్ల ఆవిష్కరణ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన నూతన సంవత్సర 2025 కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగారం మున్సిపల్ రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, కౌకుట్ల మమతాకర్‌రెడ్డి, సంఘం అధ్యక్షులు కొత్తగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, జి.ఆర్.ఎస్.ఎస్. రెడ్డి, సంఘం నేతలు కొండల్‌రెడ్డి, యాదిరెడ్డి, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగారం సత్యనారాయణ కాలనీలో..

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ 2025 కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యనారాయణ కాలనీ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, లావణ్య శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు మధుసుధన్‌రెడ్డి, ట్రెజరర్ పుండరీకం, కాలనీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో..

పోచారం మున్సిపాలిటీ అన్నోజీగూడ యాదాద్రి పార్కు వద్ద సూర్యయూత్-2025 నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సామాజిక కార్యక్రమాలు, సమాజ సేవలో యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, మంగారెడ్డి, జితేందర్‌నాయక్, శివాజీముదిరాజ్, రమేష్, కృష్ణగౌడ్, అర్జున్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూర్యయూత్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి



నాగారం సత్యనారాయణ కాలనీలో..



నాగారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..

ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

కీసర: విద్యార్థులు చదువులతోపాటు అన్నీ రంగాల్లో ముందుకెళ్లే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి జగదీశ్వర్ మునిగేల అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో గల లీడ్ ఇండియా భారత్ రత్నాస్ పాఠశాలలో 11వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిజిటల్ ఈడ్జి బిజినెస్ సొల్యూషన్ ఎల్ఎల్‌పి సీఈఓ రాజపంతం, టీఆర్ఎస్ఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ ఎస్.ఎన్.రెడ్డి, స్కూల్ చీఫ్ అడ్వైజర్ స్వర్ణలత, స్కూల్ డైరెక్టర్ ఎన్.బి. విజయలక్ష్మీ, పాఠశాల ప్రిన్సిపాల్ పరిమళరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి జగదీశ్వర్ మునిగేల తదితరులు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

19న గట్టు మైసమ్మ జాతర

ఘట్‌కేసర్: ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినం అనంతరం వచ్చే ఆదివారం రోజున నిర్వహించనున్న శ్రీ గట్టుమైసమ్మ జాతరను ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శ్రీ గట్టు మైసమ్మ జాతర నిర్వాహణపై ఆదివారం నాయకులు, కుల పెద్దలు, గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జనవరి 19న జాతరను వైభవంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఈఓ భాగ్యలక్ష్మీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, వెంకట్‌రెడ్డి, మల్లేష్, నాయకులు అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, నాగరాజ్ ముదిరాజ్, ఆలయ ధర్మకర్తలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

అంబేడ్కర్ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న సత్యనారాయణ, రఘు

ఘట్‌కేసర్: అంబేడ్కర్ 60 దేశాల రాజ్యాంగాలు చదివి భారత్‌కు రాజ్యాంగం అందజేశాడని హోలియా దాసరి సంక్షేమ సంఘం మున్సిపల్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రఘు అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నేటి యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, దాసు, నర్సింగ్‌రావు, రాజేష్‌కుమార్, దశరథ, భిక్షపతి, సమ్మయ్య, రాజు, కృష్ణ, గణేష్‌కుమార్, జ్ఞానేశ్వర్, రాములు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: బాల్యంలో తమతో చదువుకున్న మిత్రుడు మరణించడంతో జెడ్పీ ఎదులాబాద్ పాఠశాల 1995–96 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు అతడి కుటుంబానికి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కామరాజు హన్మంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 35 వేలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ బ్యాచ్‌లో ఎవరు మరణించినా వారి కుటుంబాన్ని ఆదుకున్నామన్నారు. కార్యక్రమంలో 1995–96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

శామీర్‌పేట్: త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మేడ్చల్ జిల్లా, తూంకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజాల్‌లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షులు గిరి, సభ్యులు నర్సింహాచారి, కుమార్, పవన్, అమరేందర్, శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు చట్టాలపై అవగాహన

మేడిపల్లి: దివ్యాంగులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని బలమోరిరావు సుమన్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాల ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి హాజరై మాట్లాడారు. దివ్యాంగుల చట్టాలు, వారి హక్కులపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్, డయల్ 100 ప్రాముఖ్యతను వివరించారు. కార్పొరేటర్ పోచయ్య, పోలీస్ సిబ్బంది, కొత్త కిషోర్‌గౌడ్, వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు కొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత

మేడిపల్లి: క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత, ఆరోగ్యంగా ఉంటామని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు డివిజన్ పరిధిలో కార్ల్ బ్యాడ్మింటన్ అకాడమీ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అకాడమీలో శిక్షణ పొంది అండర్ – 11 చాంపియన్‌షిప్‌లో పాల్గొని కాంస్యం సాధించిన అయాన్, కిషోర్‌లను అభినందించారు. నిర్వాహకులు నళినిమధుసూదన్, అవినాష్‌రెడ్డి, హెడ్‌కోచ్ సురేష్, దీప్తిశాలిని, శ్యామ్, క్రీడాకారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై ఆరా



బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆదివారం బోడుప్పల్ కమిషనర్ రామలింగం పరిశీలించారు. సర్వే వివరాలను సూపర్‌వైజర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం 15,484 మంది దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటి వరకు 10వేల మందిని సర్వే చేసినట్లు వివరించారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

మేడిపల్లి: మేడిపల్లి లయన్స్ క్లబ్ సేవలను దశలవారీగా విస్తరిస్తామని మేడిపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాథంగౌడ్ అన్నారు. ఆదివారం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మేడిపల్లి మండలంలో తమవంతు బాధ్యతగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పల్లె బాల్‌రాజ్‌గౌడ్, బింగి భిక్షపతి, లావణ్య, హరినాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీందర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.